## ప్రభుత్వానికి సహకరిస్తాం

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**




రాజీవ్ ఆరోగ్య శ్రీ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, డిసెంబర్ 10: పభుత్వం చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ సహకారం ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్యక్రమాన్ని అమీర్‌పేట్‌లోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్, ఆరోగ్య శ్రీ అధికారి దశరథ్ సింగ్, ఆర్ఎంవో డాక్టర్ వినాయక్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకాన్ని కూడా ప్రారంభించారు. మహలక్ష్మి పథకం కింద రూ.2,500ల ఆర్థిక సహాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, పెన్షన్ రూ.4వేల కోసం అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## రాతి శిలలను రక్షించుకుందాం

- ట్రెక్కింగ్‌కు హాట్‌స్పాట్ హైదరాబాద్
- ప్రతినెలా మూడోవారం ట్రెక్కింగ్
- గుట్టలు ఎక్కేందుకు తరలివెళ్తున్న నగరవాసులు



సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): ట్రెక్కింగ్‌కు హాట్‌స్పాట్‌గా మహా నగరంతోపాటు శివారు ప్రాంతాలు నిలుస్తున్నాయి. వర్షాకాలం మినహాఇస్తే.. ప్రతినెలా మూడోవారం ట్రెక్కింగ్ కోసం నగర శివారు ప్రాంతాలకు తరలివెళ్తున్నట్లు ట్రెక్కర్స్ బృందం సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రకృతిలో భాగమైన రాతిగుట్టలను కాపాడుకోవాల్సిన అవసరముందని చెబుతున్నారు. సహజ వాతావరణాన్ని పరిరక్షించుకుంటేనే జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలమని పేర్కొంటున్నారు. ప్రతినెలా ఒక్కో ప్రాంతాన్ని సందర్శిస్తూ యువతను ట్రెక్కింగ్‌లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

**ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతాలివే..**

నగరంతోపాటు నగర నలుమూలల వెలిసిన రాతి కొండలను సేవ్‌రాక్ సొసైటీ సభ్యులు సందర్శిస్తున్నారు. వింటర్ సీజన్‌లో అనేక కొండలపై ట్రెక్కింగ్ సైతం నిర్వహించినట్లు సొసైటీ ప్రతినిధి జీఆర్‌బీ ప్రదీప్ తెలిపారు. గండిపేట రాక్స్, దుర్గం చెరువు దగ్గరున్న గుట్టలు, మౌలాలి రాక్ కాంప్లెక్స్, శామీర్‌పేటలోని వేంకటేశ్వర స్వామి గుట్ట, ఖాజాగూడలోని ఫక్రుద్దీన్ గుట్టతోపాటు రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలను సందర్శించి ట్రెక్కింగ్ చేశారు. రాతిగుట్టలను సందర్శించేందుకు సుమారు 50మంది బృందంగా ఏర్పడి, సుమారు మూడు గంటల పాటు విజిట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బృందంలో చిన్నారుల నుంచి మొదలుకొని వృద్ధుల వరకూ ఉంటారని ప్రదీప్ తెలిపారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను..

**మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్**

# త్వరితగతిన అమలుచేయాలి

**ఆరోగ్యశ్రీ పథకం పెంపు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాలు ప్రారంభం**

బంజారాహిల్స్, డిసెంబర్ 10 :ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మహలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకాన్ని, ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.10లక్షల పెంపు పథకాన్ని ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని, ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలుచేయాలని అన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆర్టీసీ బస్సులో కొంతదూరం ప్రయాణించి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ రాజేందర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ పథకం పరిధి పెంపునకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**కార్యకర్తల నినాదాలతో ఉద్రిక్తత..**

ఇదిలా ఉండగా బస్తీ దవాఖానలో ఆరోగ్యశ్రీ పథకం పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్ అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి వెంట వచ్చిన కార్యకర్తలు జై కాంగ్రెస్, జై రేవంత్ నినాదాలు చేయడంతో అక్కడున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీల నినాదాలు చేయవద్దంటూ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించినా కాంగ్రెస్ కార్యకర్తలు వినకపోవడంతో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది.



ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

# మీ భద్రత.. నా బాధ్యత

- కష్టపడి మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా
- 'కృతజ్ఞత సభ'లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్/కాప్రా, డిసెంబర్ 10: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనను కుటుంబ సభ్యుడిగా భావించి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట్ డివిజన్ హెచ్‌బీకాలనీ ఫేజ్-2 మైదానంలో డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'కృతజ్ఞత సభ'కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. హెచ్‌బీకాలనీవాసులు, కాలనీ సంఘాలు, కుల సంఘాలు, నియోజకవర్గం పరిధిలోని ప్రజలందరూ తనను కన్నబిడ్డగా భావించి భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. ఏ అవసరం వచ్చినా ముందుండి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. పిల్లల చదువు, ఫీజులు, ఆరోగ్యం విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తన వంతు సహాయం అందజేస్తానని చెప్పారు. యువత ఉద్యోగాలు, వ్యాపారాలకు, ఇతరత్రా ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో బస్తీ దవాఖాన, వంద పడకల హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ పూజలు చేయాలని అభ్యర్థించారు. అందరి భద్రత తన బాధ్యత అన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ బీఎల్ఆర్ అన్నకు టిక్కెట్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల వరకు అలుపెరుగకుండా ప్రచారంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలకు ముందే డివిజన్‌లోని పలు కాలనీలను రెసిడెన్షియల్ జోన్ లోకి మార్పిస్తూ జీఓ ఇప్పించినట్లు చెప్పారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో డివిజన్ నుంచి భారీ మెజారిటీ అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, వంజరిప్రవీణ్, మధు ముదిరాజ్, మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్ష కార్యదర్శులు, కాలనీ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కులసంఘాల ప్రతినిధులు, మహిళా నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**

వెంగళరావునగర్, డిసెంబర్ 10 : ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని దివ్యాంగులకు కూడా వర్తింపజేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లో ప్రభుత్వ మానసిక చికిత్సాలయం వద్ద ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం మాదిరిగా దివ్యాంగులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి షరీఫ్ ఖురేషి, డివిజన్ నాయకులు నజీర్, జావీద్, అజీమ్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



ఐఎల్‌పీఏ సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

## జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 10 : సామాజిక న్యాయంతోనే సమాజం పరిఢవిల్లుతుందని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ)మూడవ జాతీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, ఐపీఎస్ మోకా సత్తిబాబు, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ కె.సునీల్ గౌడ్, సభ్యులు బి.జయకర్, జితేందర్‌రెడ్డి, కొండారెడ్డి, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్.బాలన్, బామ్‌సెఫ్, బీఎంఎం జాతీయ అధ్యక్షుడు వామన్ మేష్రంలతో కలిసి జెండా ఎగురవేసి సమావేశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.